ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 38.0 । కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5

నారాయణపేట
జిల్లా వార్తలు
సోమవారం 5 మే 2025

ఉత్తరప్రదేశ్ యువకుడి ఆత్మహత్య
● ఫ్యాన్‌కు ఉరేసుకొని అఘాయిత్యం 7
● నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు బీసీ కాలనీలో ఘటన



ఉపాధి కల్పించేవారికే ఉపాధి కరువై

కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాం. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళుతున్నాం. కానీ ప్రభుత్వం తమను గుర్తించడంలేదని నాలుగు నెలలుగా వేతనాలు లేక ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

- లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్, గద్వాల



కూలి డబ్బులు ఇవ్వాలి

వేసవికాలంలో ఎలాంటి పనులు లేకనే ఉపాధిహామీ పనికి వెళుతుంటాం.. ఈ సమయంలో మాకు ఈ పథకంలో వచ్చే డబ్బులే ఆధారం. కానీ చాలా రోజుల నుంచి పనికి వెళ్తున్నా డబ్బులు మాత్రం ఇవ్వడం లేదు. ఎప్పుడైనా 15 నుంచి 20 రోజుల్లో ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. కానీ ఇప్పుడు కావడం లేదు. వేసవిలో పని చేస్తే గతంలో కొంత కలిపి భత్యం ఇచ్చేవారు. రెండు సంవత్సరాల నుంచి అవి కూడా అందడం లేదు. ప్రభుత్వం వెంటనే కూలి డబ్బులు జమ చేయాలి.

- స్వాతి, వెలుగొమ్ముల, మహబూబ్‌నగర్ జిల్లా

ఉపాధి హామీ..

వేతన వెతలు


మిడ్జిల్‌లో కూలీ డబ్బుల కోసం ఏపీవోకు వినతి పత్రం ఇస్తున్న కూలీలు

- ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా అందని వేతనాలు
- మూడు నెలలుగా ఏపీవోలు, ఈసీలు, సీఏలకు ఇబ్బందులు
- రెండు నెలల నుంచి కూలీలకు కూడా అందని డబ్బులు
- ఇప్పటికే ఎన్‌ఐసీతో వేసవి భత్యాన్ని కోల్పోయిన కూలీలు
- ఎండలు మండుతున్నా పని ప్రదేశాల్లో సౌకర్యాలు మృగ్యం

మహబూబ్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు, కూలీలకు వేతన వెతలు తప్పడం లేదు. నెలలుగా అటు ఉద్యోగులకు వేతనాలు నిలిచిపోవడం, ఇటు కూలీలకు పని డబ్బులు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పని ప్రదేశాల్లో సౌకర్యాలు సరిగా కల్పించడం లేదు. దానికితోడు మండే ఎండల్లో పని చేస్తున్నా సమయానికి డబ్బులు కూడా అందడంలేదని కూలీలు వాపోతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 53.09 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 1.10 కోట్ల మంది కూలీలు అర్హులుగా ఉన్నారు. ఉన్న జాబ్‌కార్డుల్లో 34.55 లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉండగా ప్రతీ ఏటా 58.06 లక్షల మంది సగటున పని పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టడం ద్వారా అటు కూలీలకు మేలు జరగడంతో పాటు పని ప్రయోజనాలు అందరికీ దక్కుతాయనే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని చేపట్టారు. అయితే కొద్దిరోజులుగా ఉపాధి హామీలో నెలకొంటున్న సమస్యలతో కూలీలు, ఉద్యోగులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం కేవలం కూలీలకే కాకుండా

(మిగతా 6లో..)

లోపలి పేజీల్లో..


8 నుంచి వేసవి..
క్రికెట్ శిక్షణ శిబిరాలు
● అప్పటిలోగా పేర్లు నమోదు చేసుకోవాలి 6


పరమాత్ముడే..
ఆపద్బాంధవుడు
● భాగవత సప్తాహ ముగింపు ఉత్సవాల్లో విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లాదాచారి 7


షూటింగ్ స్పాట్
● ఆకట్టుకుంటున్న నాగర్‌కర్నూల్ మినీ ట్యాంక్‌బండ్
● ప్రీ వెడ్డింగ్, షార్ట్ ఫిలిమ్స్ షూట్‌లతో సందడి 7


నారాయణపేటలో అంతర్రాష్ట్ర రహదారిపై గన్నీ బ్యాగుల కోసం బైఠాయించిన రైతులు(ఫైల్)

అన్నదాత ఆగ్రహం

- గన్నీ బ్యాగుల కోసం రాస్తారోకోలు
- నారాయణపేట జిల్లాకు అవసరమైన బ్యాగులు 37.50 లక్షలు
- ఇప్పటి వరకు పంపిణీ చేసినవి 34.50 లక్షలు

నారాయణపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): గన్నీ బ్యాగుల కోసం రైతులు రోడ్డెక్కుతున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా పది రోజుల నుంచి జిల్లాలో ఏదో ఒక చోట ఆందోళనలకు దిగుతున్నారు. ప్రధానంగా నారాయణపేట, మక్తల్, దామరగిద్ద, ధన్వాడ, నర్వ, మాగనూర్,ఊట్కూర్ మండలాల్లో రైతులు గన్నీ బ్యాగుల కొరతను ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 100 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,36,000 ఎకరాల్లో వరి సాగు చెయ్యగా, 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని సివిల్ సప్లయ్ శాఖ లక్ష్యంగా పెట్టుకొన్నది. 37.50 లక్షల గన్నీబ్యాగులు అవసరం ఉండగా, ఇప్పటి వరకు 34.50 లక్షల బ్యాగులు రైతులకు పంపిణీ చేశారు. ఇంకా మూడు లక్షల గన్నీ బ్యాగులు మాత్రమే రావాల్సి ఉందని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. త్వరలో అవి వస్తాయని అంటున్నారు. అయితే రైతులు కొనుగోలు కేంద్రాల నుంచి గన్నీ బ్యాగులు తీసుకెళ్తున్నా.. ధాన్యం తేవడంలో జాప్యం చేస్తున్నారని అంటున్నారు. కొందరు రైతులు రాజకీయ నాయకుల సిఫారసుతో పంట కోస్తున్న వారు, కల్లాల్లో ధాన్యం ఆరబెడుతున్న వారు గన్నీ బ్యాగులు పొందుతున్నారని తెలుస్తోంది. మరికొందరు రైతులు రోజుల తరబడి తిరుగుతున్నా.. గన్నీబ్యాగులు దొరకక ఆందోళనకు దిగుతున్నారు.


నారాయణపేట శివారులో ఓ రైస్ మిల్ వద్ద ధాన్యం బస్తాలతో బారులు తీరిన ట్రాక్టర్లు

ప్రశాంతంగా నీట్

- మహబూబ్‌నగర్ జిల్లాలో 13 కేంద్రాల ఏర్పాటు
- 4,454 మందికి గాను 4,338 హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 4 (ఆంధ్రజ్యోతి): నీట్(నేషనల్ ఎలిజబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో 11, జడ్చర్ల, హన్వాడలలో ఒక్కోటి చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 4,454 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 4,338 మంది హాజరయ్యారు. 116 మంది గైర్హాజరు అయ్యారు. విద్యార్థులు ఉదయం నుంచే కేంద్రాల వద్దకు రావడంతో సందడి నెలకొంది. విద్యార్థులను నిబంధనల ప్రకారం తనిఖీ చేసి, బయోమెట్రిక్ తీసుకుని పరీక్ష హాల్‌లోకి పంపించారు. విద్యార్థులకు ఆభరణాలు ఉంటే అక్కడే తీయించారు. మధ్యాహ్న 1:30 వరకు విద్యార్థులను కేంద్రాలకు అనుమతించారు. కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

పరీక్ష కేంద్రాలను కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. నిబంధనలను పాటించాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం, ఎన్టీఆర్ మహిళా, ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ మాడల్ బేసిక్ స్కూల్, బాలుర జూనియర్ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. వాటితో పాటు హన్వాడ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, జడ్చర్ల డాక్టర్ బీఆర్అర్ డిగ్రీ కళాశాల కేంద్రాలను కూడా తనిఖీ చేశారు.


ఎండకు గొడుగు పట్టుకొని వస్తున్న విద్యార్థిని


ప్రభుత్వ మాడల్ బేసిక్ హైస్కూల్ కేంద్రం వద్ద విద్యార్థులు, వారి వెంట వచ్చిన తల్లిదండ్రులు, సంరక్షకులు


నోటీసు బోర్డుపై హాల్ టికెట్ నంబర్లు చెక్ చేసుకుంటున్న విద్యార్థినులు


విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి లోపలికి పంపుతున్న పోలీసులు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి


పరీక్షా కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి


పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

- పనులకు వెళ్లగా.. వాంతులు, విరేచనాలు
- నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ మృతి


బొట్క రేణుక(ఫైల్)

బిజినేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి వడదెబ్బతో తీవ్ర అస్వస్థకు లోనై చికిత్స పొందుతూ బొట్క రేణుక (36) అనే మహిళా వ్యవసాయ కూలీ మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు... నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన రేణుక రోజులాగే ఆదివారం వ్యవసాయ కూలీ పనులకు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత తల తిరగడం, వాంతులు, విరేచనాలు అయ్యాయి. వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతురాలికి భర్త బొట్క బంగారయ్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

దారంతా పూల వనం

వనపర్తి జిల్లా కేంద్రం నుంచి పెబ్బేరుకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న అలంకరణ చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఎర్రగా పూసిన పూలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు వాటిని చూసి నేత్రానందం పొందుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ఆ దృశ్యాలను క్లిక్ మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి




పునరావాస పనులు ప్రారంభం

- యంత్రాలతో భూమి లెవలింగ్
- ఉదండాపూర్ నిర్వాసితులకు త్వరలో సౌకర్యాలు


భూమిని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గ్రామాల నిర్వాసితులకు పునరావాస పనులు పునఃప్రారంభం అయ్యాయి. పునరావాస కేంద్రంలో యంత్రాలతో భూమి లెవలింగ్, చదును చేసే పనులు చేపడుతున్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు ఒంటిగుడిసె తండా, రేగడిపట్టి తండా, తుమ్మలకుంట తండా, చిన్నగుట్ట తండా, శ్యామగడ్డ తండాల వారికి పునరావాసం కల్పించేందుకు జడ్చర్ల మండలం దేవునిగుట్టకు వెళ్లే దారిలో 299 ఎకరాల భూమిని సేకరించారు. దేవునిగుట్టకు వెళ్లే దారిలోని రోడ్డుకు ఓ వైపు 280 ఎకరాలు, మరో వైపు 19 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. కాగా 19 ఎకరాలలో పునరావాస పనులను చేపట్టారు. ప్రస్తుతం 280 ఎకరాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గడిచిన సంవత్సర కాలంగా పనులు జరగకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పనులు ఆగిపోయాయని, వెంటనే చేపట్టాలని ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తీసుకెళ్లారు. దాంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. పునరావాస కేంద్రంలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పనులను చేపడ్తున్నారు. అందులో భాగంగా గత నెల 15న పనులు, ఇతర సమస్యలపై కలెక్టర్ విజయందిరబోయి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ప్రాజెక్టు పనులపై ఇరిగేషన్‌శాఖ అధికారులతో ప్రతీ మంగళవారం సమీక్ష నిర్వహిస్తున్నారు.

అన్ని సౌకర్యాలతో త్వరలోనే పునరావాసం

ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితులకు త్వరలోనే అన్ని సౌకర్యాలతో పునరావాసం కల్పిస్తాం. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. పునరావాస కేంద్రం కోసం సేకరించిన భూములకు పరిహారం రాలేదని కొందరు మా దృష్టికి తెచ్చారు. అందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ముంపు తండాలవాసులకు ఇప్పటికే పరిహారం అందించాం. వల్లూరు నిర్వాసితులకు సైతం రూ.73 కోట్లు మంజూరు అయ్యాయి. ఉదండాపూర్ గ్రామ నిర్వాసితులకు త్వరలోనే పరిహారం అందేలా కృషి చేస్తా.

- జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే

8 నుంచి వేసవి..
క్రికెట్ శిక్షణ శిబిరాలు

● అప్పటిలోగా పేర్లు నమోదు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. గతేడాది నుంచే ఉమ్మడి జిల్లాలో వేసవి శిబిరాలు ఏర్పాటు చేసి, శిక్షణ ఇవ్వనుండగా.. శిబిరాల్లో రాణించే క్రీడాకారులకు హెచ్‌సీఏ క్రీడా పోటీలకు ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఐదు శిబిరాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు వేసవి శిబిరాలకు అవకాశం కల్పించింది. ఈనెల 8న జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో ప్రారంభోత్సవానికి హెచ్‌సీఏ సంయుక్త కార్యదర్శి బస్వరాజ్, హెచ్‌సీఏ ప్రతినిధులు హాజరుకానున్నారు. 9న జడ్చర్ల (డీఎస్‌ఏ స్టేడియం), నారాయణపేట (మినీ స్టేడియం), 10న గద్వాల (మినీ స్టేడియం) నాగర్‌కర్నూల్ (నల్లవెల్లి రోడ్డు, క్రికెట్ అకాడమీ)లో శిబిరాలు ప్రారంభించనున్నారు. బాలురతో పాటు బాలికలకు శిక్షణ ఇస్తారు. 9 నుంచి 23 ఏళ్ల క్రీడాకారులు ఆయా జిల్లాలో ఈ నెల 8లోగా శిబిరాల్లో చేరేందుకు పేర్లు నమోదు చేసుకోవాలి. నెల రోజుల పాటు ఈ వేసవి శిబిరాలు కొనసాగుతాయి.


ఎండీసీఏ మైదానం

గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ చాటే అవకాశం..

సాధారణ పిచ్‌లపై సాధన చేసే గ్రామీణ క్రీడాకారులకు ఈ వేసవి శిబిరాల్లో వారికి మ్యాట్లు, నెట్లలో శిక్షణ ఇవ్వనుండటంతో చక్కటి ప్రతిభ చాటే అవకాశం ఉంది. అండర్-9 నుంచి అండర్-23 క్రికెటర్లకే క్రికెట్ సంఘం తరుపున అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. రోజు ఉదయం నిర్వహించే శిబిరాలకు హాజరయ్యే క్రీడాకారులకు అరటిపండ్లు, గుడ్లు, తాగునీరు అందిస్తారు. నిష్ణాతులైన కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో శిక్షణ అందజేస్తారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లో వసతి కల్పించి శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శిక్షణ శిబిరాల్లో పేరు నమోదు కోసం మహబూబ్‌నగర్ - 9502356329, జడ్చర్ల - 9985375737, నారాయణపేట - 910075368, నాగర్‌కర్నూల్ - 8919386105, గద్వాల - 9885955633 సంప్రదించాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల వేసవి శిబిరాలు హెచ్‌సీఏ సహకారంతో నిర్వహిస్తున్నాం. ఏడేళ్ల తరువాత గత ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాలో వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నాం.అండర్-10 నుంచి అండర్-23 క్రికెటర్లకే క్రికెట్ సంఘం తరుపున అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. నిష్ణతులైన కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో శిక్షణ అందజేస్తాం. క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా స్థాయి 2డే లీగ్ పోటీలు నిర్వహిస్తాం. ప్రతిభ చాటిన వారిని జూన్‌లో నిర్వహించే హెచ్‌సీఏ లీగ్ పోటీలకు ఎంపిక చేస్తాం.

-ఎం.రాజశేఖర్, జిల్లా క్రికెట్ ప్రధాన సంఘం కార్యదర్శి


ఎండీసీఏ స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు (ఫైల్)

ఉపాధిహామీ వేతన వెతలు


వేతనాలు చెల్లించాలని గద్వాల కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగులకు కూడా నెలల నుంచి వేతనాలు లభించడం లేదు. ప్రస్తుతం ఎండలు రాష్ట్రవ్యాప్తంగా 40 డిగ్రీలకు చేరుకున్నాయి. ఉదయం వేళల్లో పని కల్పిస్తున్నప్పటికీ 8 గంటల వరకే ఉష్ణోగ్రతలు భరించలేని విధంగా నమోదవుతున్నాయి. గతంలో వేసవి ఎండల్లో పనిచేసినందుకుగాను ప్రభుత్వం వారి పనిని అంచనాలు వేసుకొని కొంతమేర వేసవి భత్యం అందించేది. కానీ ఇప్పుడా వేసవిభత్యం కూడా అందడం లేదు.

నెలలుగా పెండింగ్..

సాధారణంగా చలికాలం పూర్తయిన తర్వాత నుంచి వేసవి పూర్తయ్యేవరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా పని ఎక్కువగా కల్పిస్తారు. మిగతా సమయంలో వ్యవసాయ, ఇతర పనులు ఉంటాయి కాబట్టి.. కూలీలు ఈ పథకాన్ని ఉపయోగించుకునేది కూడా ఇప్పుడే. ఏ పనులు లేకనే ఉపాధి పనులకు వస్తుంటారు. ప్రస్తుతం కూలీ పనికి వచ్చినందుకు రోజుకు రూ. 300 చొప్పున అందజేస్తున్నారు. కొలతలను బట్టి కూడా ఇందులో వ్యత్యాసం ఉండవచ్చు. కానీ ఫిబ్రవరి నుంచి ఉపాధి కూలీ అందడం లేదు. సాధారణంగా వారానికోసారి ఆ ఏడు రోజుల్లో చేసిన పనికి సంబంధించిన వివరాలను అప్లోడ్ చేస్తారు. అప్పటి నుంచి వారం రోజుల్లోగా ఉపాధి కూలీలకు డబ్బులు అందుతాయి. ఈ వ్యవధి గరిష్ఠంగా 20 రోజులకు మించదు. కానీ ఇప్పుడు దాదాపు రెండున్నర నెలల నుంచి వారికి కూలీ డబ్బులు అందడం లేదు. అలాగే కూలీలతో పనిచేసేందుకు ప్రతీగ్రామంలో ఒక ఫీల్డ్ అసిస్టెంట్ ఉంటారు. పనులను అంచనా వేసి వాటి బిల్లులను పంపిచేందుకు కంప్యూటర్ ఆపరేటర్లు, ఈసీలకు, పర్యవేక్షణ కోసం ఏపీఓలు ఉంటారు. వీరికి కూడా వేతనాలు అందడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా 7551 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా వీరికి ప్రతీనెల రూ. 12 వేల చొప్పున వేతనం ఇవ్వాలి. కానీ నాలుగు నెలలుగా అందడం లేదు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలకు కూడా రెండు నెలల నుంచి వేతనాలు రాలేదు.

వేసవి భత్యం అంతే సంగతి..

ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతోంది. ఏప్రిల్‌లోనే 40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు వెళ్లాయి. ఈ ఎండల్లో పనిచేయడం చాలా కష్టంతో కూడుకున్న పని, ఇప్పటికే పనిప్రదేశాల్లో సౌకర్యాలు లేవు. నీటి వసతి, టెంట్ ఏర్పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం, ఫస్ట్ ఏయిడ్ కిట్లు ఇలాంటివి అందుబాటులో ఉండని పరిస్థితి. అదే సమయంలో వేసవి కావడంతో కూలీలు ప్రధానంగా ట్రెంచ్‌లు తవ్వడానికి, కాలువల్లో పూడిక తీయడానికి, వర్షపు నీరు స్టోరేజీ కోసం ఫిట్స్ తవ్వడానికి ఎండాకాలంలో భూమి తేమలేక గట్టిగా ఉంటుంది. ఈ క్రమంలోనే గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20 శాతం కూలీకి అదనంగా వేసవిభత్యం అందించేది. అయితే రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ఉపాధికూలీలకు అంతవరకు ఉన్న టీటీసీ (టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్) సాఫ్ట్‌వేర్‌ను తొలగించి నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)ని ప్రవేశపెట్టింది. ఈ సాఫ్ట్‌వేర్‌లో వేసవిభత్యం చెల్లించడానికి ఆప్షన్ లేకపోవడంతో రెండేళ్లుగా ఆ డబ్బులు అందడం లేదు. కూలీల డబ్బులు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయడంతో పాటు ఉద్యోగులు చేస్తున్న అవకతవకలను కట్టడి చేసేందుకే ఈ సాఫ్ట్‌వేర్ తెచ్చినప్పటికీ ప్రస్తుతం వేసవిభత్యం రాకపోవడానికి ఎన్ఐసీ ప్రధాన అడ్డంకిగా మారిందని చెప్పవచ్చు.

హక్కుల రక్షణకే దేశవ్యాప్త సమ్మె

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటంరాజు



మాట్లాడుతున్న కోటం రాజు

పాలమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కుల సాధనకే ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటం రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్రిటీష్ కాలంలో వచ్చిన సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, పోరాడే హక్కు, బేర సారాల హక్కులను బీజేపీ కేంద్ర ప్రభుత్వం హరిస్తోందన్నారు. 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లుగా తెచ్చిందన్నారు. దీనివల్ల కార్మికులు అనేక హక్కులు కోల్పోతారని హక్కుల రక్షణకై మే 20న సమ్మెలో సకల కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, రైతు సంఘం ఏ.రాములు, మోహన్, లక్ష్మయ్య మాట్లాడుతూ హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్, కుమార్, ఖమర్‌అలీ, అవాజ్ కార్యదర్శి ఖయ్యూం పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


ఆలయానికి వచ్చిన స్వాములు

కృష్ణ, మే 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని చెక్‌పోస్టు వద్ద నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి పంచమ సిద్ధలింగ మహాస్వాములు, అంబాత్రయ క్షేత్రం వ్యవస్థాపకులు ఆదిత్యపరాశ్రీ స్వాములు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కొత్తకోట సిద్ధార్థ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు మహాస్వాములను, నాయకులను శాలువా, పూలమాలలతో సన్మానం చేసి ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, అన్నెంకృష్ణ, గణపతి, రామారావు, సుబ్బరాజు, నాయకులు కృష్ణమూర్తి, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

వంతెనపై ట్రాఫిక్ జామ్

కృష్ణ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామ శివారులోని చెక్‌పోస్టు వద్ద కృష్ణానది వంతెనపై ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ జాం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి పొట్టు తీసుకొని వెళ్తున్న భారీ వాహనం వంతెనపై నిదానంగా వెళ్లడంతో అటు, ఇటు వెళ్లే వాహనాలకు సైడ్ దొరకక ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి దాదాపు రెండు గంటల పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


వంతెనపై నిలిచిన వాహనాలు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- మాజీ మంత్రి వీ.శ్రీనివాస్‌గౌడ్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ మంత్రి వీ.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఖలీల్ చౌక్‌లో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ అండర్-20 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే క్రీడాభివృద్ధి జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు క్రీడలను ప్రోత్సహించామన్నారు. ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, నాయకులు మోసిన్‌ఖాన్, ఇమ్రాన్, నవకాంత్, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రామకృష్ణ, నిర్వాహకులు జుబేర్, ముజహర్, షాకీర్, సాబాజ్ పాల్గొన్నారు.

నాయినోనిపల్లి మైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, మే4 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే మైసమ్మ తల్లికి బోనం కుండలో నైవేద్యం వండి ప్రత్యేకంగా అలంకరించి కోళ్లు, పొట్టేళ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల నుంచి హుండీ ద్వారా రూ.1,44,955లు, టికెట్ల ద్వారా రూ.47,205లు మొత్తం రూ.1,92,160ల ఆదాయం వచ్చినట్లు ఈవో, చైర్మన్ తెలిపారు.

'భవిష్యత్ తరాల కోసం చరిత్రను రికార్డు చేయాలి'

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 4(ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాల కోసం చరిత్రను పుస్తక రూపంలో రికార్డు చేయాలని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం వనపర్తిలో ఏర్పాటు చేసిన జ్ఞాన దర్శిని ఎల్లూరు గ్రామ చరిత్ర పుస్తక పరిచయ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ దేశమైనా.., ప్రాంతమైనా.. తమ పూర్వ చరిత్రను విస్మరిస్తే అంతకన్న లోపం మరొకటుండదని వివరించారు. ఎల్లూరు కొల్లాపూర్ సంస్థానానికి కొంతకాలం పాటు రాజధానిగా ఉన్నదని గుర్తు చేశారు. చారిత్రకంగా చోళుల కాకతీయుల కాలానికి సంబంధించిన ఆనవాళ్లు అక్కడ ఉన్నాయని శంకర్ గౌడ్ చెప్పారు. ఎల్లూరులో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసి 70 సంవత్సరాలవుతున్నా సందర్భాన్ని పురస్కరించుకుని ఈ జ్ఞాన దర్శిని సంచికను ప్రచురించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రంథ రచనకు కృషి చేసిన కంటే నిరంజనయ్యను ప్రతినిధులు శాలువా పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు జనజ్వాల ఓంకార్, బైరోజు చంద్రశేఖర్, డా.శ్యాంసుందర్, బండారు శ్రీనివాస్, రాజారాం ప్రకాష్, కిరణ్ కుమార్, గంధం నాగరాజు, కృష్ణయ్య, ఆనంద్, దాసరి కృష్ణ, మొజర్ల కృష్ణ, పావనం చంద్రశేఖర్, సురేందర్, రంగస్వామి, వహీద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- కులగణన ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రకటించాలి
- 20న దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నాగర్‌కర్నూల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వందశాతం అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పా.. మిగతా ఐదు గ్యారెంటీలను వందశాతం అమలు చేయడం లేదన్నారు. రైతు రుణమాఫీ అరకొరగా ఉందని, దీనిని పూర్తి చేసేందుకు అవసరమైన మరో రూ.పదివేల కోట్లు తక్షణం విడుదల చేయాలన్నారు. తెల్లరేషన్‌కార్డుపై సన్నబియ్యం అందించడం సంతోషదాయకమే అయినప్పటికీ సామాన్య జనాలకు అవసరమైన 14 రకాల నిత్యవసర సరకు లను సరిఫరా చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికమైన విధానాలను అవలంభిస్తుందని, ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న కార్మికులు చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెకు తమ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, ఆర్.శ్రీనివాసులు, దేశ్యానాయక్, ఆంజనేయులు, అంతటి కాశన్న, గీత, అశోక్, నరసింహ, ఎం.శ్రీనివాసులు, మధు తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి ఆయశ సాధనకు కృషి చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్ : తన జీవితాంతం కమ్యునిస్టుగా పేద ప్రజల పక్షాన నిలిచిన కందికొండ రామస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి ఊహకు కందికొండ రామస్వామి స్మారక పురస్కారం అందజేశారు. సింగిల్ విండో సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శితో పాటు ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరయ్యారు. కార్యక్రమంలో కందికొండ మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, నారాయణగౌడ్, జెట్టి ధర్మరాజు, నిరంజన్, రాములు, వర్ధం పర్వతాలు, అబ్దుల్లాఖాన్, ఆర్.శ్రీనివాస్, గీత తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో చర్చించాలి

కల్వకుర్తి: కేంద్ర ప్రభుత్వం కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తుందో ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ చర్యలను వెంటనే నిలిపి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఆయన కోరారు. నాగర్‌కర్నూల్ జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వచ్చే ఏడాది నాటికి మా వోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి ప్రకటించడం సరైంది కాదన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై తొలిసారిగా కల్వకుర్తికి రావడంతో పలు ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంజనేయులు, మల్లయ్య, పరశురాములు, చిన్నయ్య, నెహ్రూ ప్రసాద్, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పందిళ్లకు పండగ..

- తీగ జాతి కూరగాయల సాగు పెంపునకు సబ్సిడీ
- జిల్లాకు 50 యూనిట్లు మంజూరు
- అర ఎకరంలో కూడా సాగుకు అవకాశం

గద్వాల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇక తీగ జాతి కూరగాయల పందిర్లకు పండగొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్మాణానికి సబ్సిడీతో కూడిన యూనిట్లు మంజూరు చేసింది. గత పదేళ్లుగా ఈ తరహా సాగుకు దూరంగా ఉన్న.. ఉంటున్న రైతులకు ఈ సబ్సిడీతో ప్రోత్సాహం లభించినట్లయింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో తీగజాతి కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై యూనిట్లను మంజూరు చేసింది. జిల్లాలో తీగజాతి కూరగాయలను పండించేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. దీనికి కారణం తీగజాతి పందిర్ల నిర్మాణం ఖర్చుతో కూడుకున్నది కావడంతో చాలా మంది రైతులు దానికి బదులు ఇతర కూరగాయలను పండిస్తున్నారు. తీగజాతి కూరగాయలను వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ఈ తీగజాతి కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తోంది. అందులో భాగంగానే సబ్సిడీపై పందిర్ల నిర్మాణానికి యూనిట్లను మంజూరు చేసింది.

రాతి, సిమెంట్ స్తంభాలు వాడొచ్చు

జోగుళాంబ గద్వాల జిల్లాకు 50యూనిట్లు మంజూరు అయినట్లు హార్టికల్చర్ అధికారి అక్బర్ అలీ తెలిపారు. అర ఎకరం ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. అంటే కూరగాయలు పండించే రైతులు అర ఎకరంలోనే తీగజాతి కూరగాయలను పండించాలి. దీని నిర్మాణానికి రాతి స్తంభాలు, లేదంటే సిమెంటు దిమ్మెలను ఉపయోగించవచ్చు. అర ఎకరానికి వరుసల మధ్య 18అడుగులు, స్తంభాల మధ్య 14అడుగులు ఎడం ఉంచినట్లు అయితే దాదాపు 93నుంచి 96వరకు స్తంభాలు అవసరం అవుతాయి. అదేవిధంగా 8గేజ్ జింక్ పూత కలిగిన జీఐ తీగ 300కేజీల వరకు అవసరం అవుతుంది. గుంతలు తీసి స్తంభాలను పాతి, తీగలను జాగ్రత్తగా అల్లుకొన్నట్లు అయితే దాదాపు 15ఏళ్ల వరకు పంటకు ఉపయోగపడుతుంది. దీని నిర్మాణానికి రూ.1.20లక్షల వరకు ఖర్చు అవుతుండగా ప్రభుత్వం రూ.50వేల వరకు మాత్రమే సబ్సిడీ ఇస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతరులకు కూడా పథకం వర్తిస్తుంది.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి

తీగ జాతి కూరగాయలైన బీరకాయ, సోరకాయ, దోసకాయ, కాకరకాయ, చిక్కుడు, బీన్స్, గుమ్మడి, బూడిద గుమ్మడి కాయలు వంటి వాటిని పండించవచ్చు. గాలి వెలుతురు ఎక్కువగా తగలడం వలన చీడపీడల బెడద తగ్గుతుంది. దీంతో తెగుళ్ల ఆశించదు. మందుల పిచికారి తగ్గుతుంది. నాణ్యమైన అధిక దుగబడి వస్తుంది. కాయలు భూమిపై పాకవడం ద్వారా వచ్చే నష్టాలను పందిర్ల ద్వార నివారించవచ్చు. అంతేకాకుండా కాయలు తాజాగా ఉంటాయి. కోయడానికి సులువుగా ఉంటుంది. శ్వాశత పందిర్లతో అధిక లాభాలు పొందవచ్చు.


గద్వాల మండలం ఈడిగోనిపల్లిలో తీగజాతి కాకర కాయలను పండిస్తున్న రైతులు

గతంలో సబ్సిడీలేక....

గత ప్రభుత్వంలో సబ్సిడీలు లేకపోవడంతో జిల్లాలో 20నుంచి 25ఎకరాలలో మాత్రమే తీగజాతి కూరగాయలు పండిస్తున్నారు. పందిర్ల నిర్మాణానికి ఎక్కువ ఖర్చు అవుతుండటంతో రైతులు తీగజాతి పంటలకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై అవకాశం ఇవ్వడంతో దీనిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఇతరులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. రైతులు అప్లికేషన్‌తో పాటు భూమి పాసు బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, ఒక ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జూన్-జూలైలో తీగజాతి సాగుకు అనుకూలమైంది. ఇప్పటి నుంచే దరఖాస్తు చేసి పనులు మొదలు పెడితే విత్తనం విత్తేనాటికి పందిరి నిర్మాణం పూర్తవుతుందని అధికారులు సూచిస్తున్నారు.

క్రైం కార్నర్

9 పశువుల చోరీ

ఖిల్లాఘణపురం, మే 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని షాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో 9 పశువులు(8 కోడెలు, 1ఆవు)లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధిత పాడి రైతు మాసయ్య తెలిపారు. షాపూర్ గ్రామ శివారు సర్వే నెంబరు 30 కర్నెతండా బీటీ రోడ్డులో శనివారం రాత్రి పంట పొలాల్లోని పశువుల పాకలో పశువులను కట్టివేసి పాడి రైతులు ఇంటి వద్ద నిద్రించారు. ఆదివారం తెల్లవారు జామున పాడి రైతులు మాసయ్య, భీమయ్య పశువుల పాక వద్దకు వెళ్లగా పశువులు కనబడలేదు. మాసయ్యకు చెందిన 3 కోడెలు, భీమయ్యకు చెందిన 2 కోడెలు, నాగయ్యకు చెందిన 2 కోడెలు, వెంకటయ్యకు చెందిన ఒక కోడె, ఒక ఆవును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు.

చోరీకి గురైన పశువుల విలువ సుమారు 4 లక్షల రూపాయలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత పాడి రైతులు పరిసర ప్రాంతాల్లో వెతికి పశువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. పశువుల పాక వద్ద వాహనంలో బలవంతంగా పశువులను ఎక్కించినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని పోలీస్‌స్టేషన్‌లో మాసయ్య తదితరులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకట నాగరాజు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఊర్కొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల రాంరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై మృతుడి భార్య కావలి యాదమ్మ తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 29న తమ తల్లిగారి గ్రామం ఆమనగల్లు మండల సింగంపల్లికి నా పిల్లలతో కలిసి వెళ్లి అక్కడ శుభకార్యంలో పాల్గొని, ఈ నెల 3న రాంరెడ్డిపల్లికి చేరుకున్నాం. నేను గ్రామానికి వచ్చే సరికి నా భర్త కావలి రామస్వామి (45) కనిపించకపోవడంతో మరిది కావలి లక్ష్మణ్‌ను అడుగగా, ఇంటి స్థలం విషయంలో గొడవ జరిగింది. ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో వచ్చినప్పటి నుంచి పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని, అప్పుడప్పుడు మద్యం సేవించి ఎక్కడైనా పడిపోయి మరుసటి రోజు వచ్చేవాడు.

ఆదివారం ఉదయం మా గ్రామ శివారు పొలంలో చొప్పగడ్డిని కొస్తున్న వ్యక్తికి దుర్వాసన వస్తున్న క్రమంలో దగ్గరికి వెళ్లి చూశాడు. ముఖంపై ఈగలు వాలి ఉండటంతో గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం ఉందని గ్రామస్థులకు తెలుపగా అక్కడికి నా మరిదితో పాటు గ్రామస్థులు వెళ్లి చూసి, రామస్వామి అని గుర్తించాం. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ కృషదేవ ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహం కుళ్లిన దశలో ఉండటంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఘటనా స్థలికి చేరుకొని అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తే కేసులు

- దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- ముగ్గురిపై కేసు నమోదు... 210 లీటర్ల కల్లు ధ్వంసం
- వివరాలను వెల్లడించిన ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి



పట్టుబడిన కల్లుతో ఎక్సైజ్ అధికారులు

గద్వాల క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో అనుమతి లేని కల్లు దుకాణాలపై శనివారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి తెలిపారు. కేసులు నమోదు చేయడంతో పాటు ముగ్గురిని అరెస్ట్ చేసి, వారినుంచి 210 లీటర్ల కల్లును ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ మద్యనిషేధ, ఎక్సైజ్ డైరెక్టర్ షెడ్యూల్ ప్రకారం జోగుళాంబ గద్వాల జిల్లా మద్యనిషేధ, ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం రాత్రి మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, గద్వాల జిల్లా టాస్క్‌ఫోర్స్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు మొత్తం మూడు బృందాలు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో మొదట గద్వాల మండల పరిధిలో మదనపల్లి గ్రామంలో లైసెన్స్ లేకుండా అక్రమంగా నిర్వహిసున్న కల్లు దుకాణంపై దాడి చేసి ఈడిగ పద్మ అనే మహిళను అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే రెండవ కేసు గద్వాల మండల పరిధిలోని చెనుగోనిపల్లి గ్రామంలో ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై దాడి చేసి ఏ-1 తెలుగురాములు, ఏ-2 తెలుగు నాగన్న అనే వ్యక్తులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో మొత్తం 3 బృందాలు పాల్గొని ముగ్గురు వ్యక్తులపై 2 కేసులు నమోదు చేసి 210 లీటర్ల కల్లును ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామ జాతీయ రహదారిపై శనివారం రాత్రి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై శివనాందం తెలిపిన వివరాల ప్రకారం... నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం జాళిపూర్ గ్రామానికి చెందిన సాయితేజ(27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం తన స్వంత ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యంలోని రంగారెడ్డిగూడ గ్రామంలోని స్థానిక జాతీయ రహదారిపై ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు, వారి కుటుంబ సభ్యులకు మృతుడి ఫోన్ ద్వారా స్థానికులు తెలపడంతో, సంఘటన స్థలంకు చేరుకున్న కుటుంబ సభ్యులు గుర్తు తెలియని వాహనం డ్రైవర్‌పై చర్యలు తీసుకొని చట్టం ప్రకారం తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, మృతదేహాని పోస్టుమార్టం అనంతరం కుటుంబీలకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవెల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై మహేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్‌కు చెందిన నరహరి(27)అనే వ్యక్తి తన స్నేహితుడు శివచారితో కలిసి గత నెల 29వ తేదీన మోటార్ బైక్‌పై కర్నూల్‌కు వెళుతున్నారు. ముందు వెళుతున్న భారీ వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టారు. వెనక కూర్చున్న నరహరికి తలకు తీవ్ర గాయం కాగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం చిన్నాన్న కమ్మరి కాలప్పచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైమ్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యువకుడు నీరజ్(22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో గల బీసీ కాలనీలో చోటు చేసుకున్నట్లు ఏఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాకు పీవోపీ పనులు చేసేందుకు గత మూడు ఏళ్ల క్రితం వలస వచ్చాడు. ఇక్కడ ఆ రాష్ట్రానికి చెందిన కొంతమందితో కలిసి పని చేస్తూ ఒకే దగ్గర ఉంటున్నారు. ఇంట్లో ఉన్న కొంతమంది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బంధువుల పెళ్లి కోసం వెళ్లారు. మరి అదే ఇంట్లో ముగ్గురు డ్యూటీ పని చేసే వారు ఉండటంతో వారు వేరే రూమ్‌లలో పడుకుని ఉండటంతో నీరజ్ ఫ్యాన్ కొండికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నీరజ్ తరచూ ఒక అమ్మాయితో ఫోన్‌లో మాట్లాడేవాడని, శనివారం రాత్రి కూడా అర్ధరాత్రి వరకు ఫోన్‌లో మాట్లాడుతూ... ఆ అమ్మాయితో గొడవ పడినట్లు తోటి వారు తెలిపారు. ఈ సంఘటనపై మృతునికి వరుసకు బావ అయిన సునీల్ సాహు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

షూటింగ్ స్పాట్



మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఆకట్టుకుంటున్న లవ్ ఎన్‌జీకేఎల్

- ఆకట్టుకుంటున్న నాగర్‌కర్నూల్ మినీ ట్యాంక్‌బండ్
- ప్రీ వెడ్డింగ్, షార్ట్‌ఫిలిమ్స్ షూటింగ్‌లతో సందడే సందడి
- ఆహ్లాద వాతావరణం మధ్య పలు సన్నివేశాల చిత్రీకరణ



నాగర్‌కర్నూల్ మినీ ట్యాంక్‌బండ్ చెరువులో బుద్ధ విగ్రహం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సోయగాలు, విశాల జలాశయం, ఆకర్షణీయమైన వాతావరణంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం మినీ ట్యాంక్‌బండ్ ప్రీ వెడ్డింగ్, షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌లకు లొకేషన్‌గా మారింది. ప్రతీ రోజు పలు జంటలు ఇక్కడికి వచ్చి తమ జీవితంలోని మధురమైన క్షణాలను సినిమాటిక్ వీడియోల రూపంలో బంధించుకుని వారి సోషల్ మీడియా స్టేటస్‌తో పంచుకుంటున్నారు. దీంతో ఫొటోగ్రాఫర్లు, షార్ట్ ఫిల్మ్ మేకర్లు ఈ ప్రదేశాన్ని ప్రత్యేకంగా ఎంపిక చేసుకుని ఉదయం, సూర్యాస్తమయం వేళల్లో ఇక్కడికి వచ్చి షూటింగ్‌లు చేస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ మొదలైందంటే కేసరి సముద్రం మినీ ట్యాంక్‌బండ్ నిత్యం వధూవరులతో ఇక్కడి వచ్చి షూటింగ్‌లతో సందడి చేస్తున్నారు. ట్యాంక్‌బండ్ వద్ద ముఖ్యంగా లవ్ ఎన్‌జీకేఎల్, బుద్ధఘాట్, బతుకమ్మ ఘాట్‌లతో షూటింగ్‌కు వారిని ఆకట్టుకుంటోంది. బండ్ పొడవునా పచ్చని మొక్కలతో గార్డెన్లు, చెరువు ఆయకట్టులో పచ్చని చేలు లోకేషన్లను డ్రోన్ షాట్లు ప్రీ వెడ్డింగ్ సూట్ చేసుకుంటున్నారు. జిల్లా నుంచే కాకుండా మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నారాయణపేట వంటి దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి షూటింగ్ చేస్తున్నారు.



మినీ ట్యాంక్‌బండ్ వద్ద ప్రీ వెడ్డింగ్ షూటింగ్ తీసుకుంటున్న యువతి(ఫైల్)

● నిత్యం సందర్శకుల సందడి

పట్టణ ప్రజలకు ఏకైక ఆహ్లాద కేంద్రం కావడంతో నిత్యం సందర్శకులతో సందడిగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వాకర్స్‌తో పాటు పార్కుల వద్ద చిన్నారులు ఆడుకునేందుకు వస్తుంటారు. వారాంతం సెలవు దినాల్లో కుటుంబంతో కలిసి ఇక్కడికి వచ్చి సేద తీరుతున్నారు. ముఖ్యంగా లవ్ ఎన్‌జీకేఎల్ వద్ద యువత కేక్ కట్ చేసి బర్త్‌డే పార్టీలు జరుపుకుంటున్నారు. గత ఏడాది దసరాకు చెరువులో బోటింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బోటింగ్‌ను నిలిపివేశారు. దీంతో స్థానిక సందర్శకులకు అది అందుబాటులో లేకుండా పోయింది. బోటింగ్‌ను తిరిగి ప్రారంభిస్తే సందర్శకుల సందడి ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● స్థానికంగా లోకేషన్ బాగుంది



మాది మక్తల్ పట్టణం. వెడ్డింగ్ షూటిం గ్ కోసం అక్కడి నుంచి వధూవరులతో జిల్లాకు వచ్చాం. మినీ ట్యాంక్‌బండ్ వద్ద లోకేషన్‌ను సోషల్ మీడియా మిత్రుల ద్వారా తెలుసుకుని ఇక్కడికి వచ్చాం. చెరువు మధ్య బుద్ధ విగ్రహం, పార్కులు, బండ్ వెనుక పంట పొలాలు లోకేషన్లు షూటింగ్ బాగున్నాయి.

- శ్రీనివాస్, వెడ్డింగ్ వీడియోగ్రాఫర్

● పార్కుల్లో పచ్చదనం పెంచుతున్నాం



మినీ ట్యాంక్‌బండ్‌కు నిత్యం సందర్శకులతో పాటు దూర ప్రాంతాల నుంచి ప్రీవెడ్డింగ్, షార్ట్‌ఫిల్మ్ షూటింగ్స్ కోసం వస్తుంటారు. సందర్శకులను ఆకుట్టుకునేలా నిత్యం బండ్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పార్కుల్లో పచ్చదనం పెంచుతున్నాం.

- మురళి, మునిసిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, నాగర్‌కర్నూల్

అసంపూర్తిగా వే సైడ్ మార్కెట్ నిర్మాణం

- ప్రధాన రహదారిపై చేపల విక్రయాలు
- రోడ్డుపై సంత... వాహనదారుల చింత
- వ్యాపారులు, వాహనదారుల అవస్థలు



ఖిల్లాఘణపురంలో అసంపూర్తిగా వే సైడ్ మార్కెట్ నిర్మాణం

ఖిల్లాఘణపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారుల క్రయవిక్రయాలకు అనువైన స్థలంగా ప్రభుత్వం నిర్మిస్తున్న వే సైడ్ మార్కెట్ అసంపూర్తిగా మిగిలిపోవడంతో రోడ్డుపై సంత నిర్వహణతో వాహనదారులకు చింత తప్పడం లేదు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో చేపలు, మాంసం, కూరగాయల విక్రయాలు ఒకే చోట జరిగేలా గత ప్రభుత్వ హయాంలో 2023లో రూ.1.90 కోట్ల నిధులతో నిర్మిస్తున్న వే సైడ్ మార్కెట్‌నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. వ్యాపారుల కోసం ప్లాట్ ఫామ్, టాయిలెట్స్ నిర్మాణం పూర్తయిన ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని గుత్తేదారు సీసీ రోడ్డు పనులను అసంపూర్తిగా చేశారు. మండల కేంద్రంలో చేపల, మటన్ మార్కెట్ నిర్దిష్ట స్థలంలో లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో రెండేళ్లుగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. విధి లేక తప్పని పరిస్థితుల్లో బస్టాండ్ ముందు ప్రధాన రహదారిపై చేపల విక్రయాలు సాగిస్తున్నారు. మండలంలోని వందల మంది మత్స్యకారులు చేపల విక్రయాల ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ చేపల కొనుగోలు బాగానే సాగుతాయి. ఇతర ప్రాంతాల వారు కూడా కొనుగోలుకు ఇక్కడికి వస్తుంటారు. షెడ్లు లేకపోవడం వల్ల కొనుగోలు చేసి తెచ్చిన చేపలను నిల్వ చేసుకోవడానికి వ్యాపారులు వేదనకు గురవుతున్నారు. రోడ్డుపై చేపల విక్రయాలు చేయడంతో దుర్వాసన వెదజల్లుతుందని బాటసారులు, వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై చేపలు పెట్టిన వెంటనే ఈగలు వాలిపోతున్నాయి. రోడ్లపైనే కూరగాయలు, మాంసం, చేపలు, చిరు వ్యాపారుల విక్రయాల మూలంగా దుమ్ము, ధూళి, ఈగలు చేరిన పదార్థాలను కొనుగోలు చేయలేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సంత రోడ్డుపై నిర్వహించడంతో వాహనదారులు రాకపోకలు కొనసాగించడానికి అవస్థలు పడుతున్నారు. రోడ్డుపైనే చిరు వ్యాపారులు అమ్మకాలు చేయడంతో దుకాణ దారులకు, వాహనదారులకు మధ్య తరచుగా తగాదాలు జరుగుతున్నాయి. గ్రామంలోకి వచ్చే అదే ప్రధాన రహదారి మధ్యలో విగ్రహాలు ఏర్పాటు చేయడంతో వాహనాలు తిరగడానికి అవకాశం లేకుండా పోయిందని వాహన డ్రైవర్లు వాపోతున్నారు.

ఇరుకు రోడ్లపై విక్రయాలు చేయడంతో సంతలో దొంగతనాలు సర్వసాధారణంగా మారాయి.

అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని వే సైడ్ మార్కెట్ నిర్మాణం వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● మార్కెట్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



అసంపూర్తిగా నిలిచిపోయిన వే సైడ్ మార్కెట్ నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి. ప్రజాప్రతినిధులు అధికారులు చొరవ తీసుకోవాలి. కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు రోడ్లపై సాగిస్తుండటంతో వినియోగదారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. చిరు వ్యాపారులు అన్ని విక్రయాలు ఒకే చోట మార్కెట్లో నిర్వహిస్తే వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

● కేశవులు, సెల్‌ఫోన్ మెకానిక్, ఖిల్లాఘణపురం

● చేపల విక్రయదారులను ప్రభుత్వం ఆదుకోవాలి



చిరు వ్యాపారులను, చేపల విక్రయదారులను ప్రభుత్వం ఆదుకొని ప్రత్యేక మార్కెట్ సదుపాయం కల్పించాలి. ఎండకు, వానకు విక్రయాలు చేయడానికి చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అమ్మకానికి తెచ్చిన సరుకు నిల్వ చేయడానికి సరైన సదుపాయాలు లేకపోవడంతో పాడైపోతున్నాయి. రైతుల మాదిరిగా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ పథకాలలో పెద్దపీట వేయాలి.

● బెస్త నారాయణ, గంగపుత్ర సంఘం నాయకులు, ఖిల్లాఘణపురం

పరమాత్ముడే ఆపద్బాంధవుడు

- భాగవత సప్తాహ ముగింపు ఉత్సవాల్లో విద్వాన్ ప్రహ్లాదాచారి
- కోటకొండలో ఘనంగా ముగిసిన స్వర్ణోత్సవాలు



సప్తాహ మంగళ కార్యక్రమంలో సీతారామారావు దంపతులు

నారాయణపేటరూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఆపద్బాంధవుడిగా నిలిచేది పరమాత్ముడేనని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లాదాచారి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కోటకొండ నరసాచలంలోని భూలక్ష్మీ వెంకటేశ్వర స్వామి స్వర్ణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా భాగవత సప్తాహ మంగళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతాన్ని, బాల్య లీలలను వివరించారు. ప్రతీ ఒక్కరు భగవంతుడిపై అచంచల విశ్వాసాన్ని, అనన్య భక్తిని కలిగి ఉండాలని విద్వాంసులు ఉద్బోధించారు. ఆలయంలో బృహతీ సహస్రయాగం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం హంపీ క్షేత్రానికి చెందిన గోవింద తీర్థ మహాస్వాముల వారు భక్తులకు అవభృత ప్రోక్షణం చేసి ఆశీస్సులను అందజేశారు. నారాయణపేట శక్తి పీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ స్వామీ శాంతానంద్ పురోహిత్ మాట్లాడుతూ జిల్లాలో రఘుప్రేమ తీర్థులు విశేషంగా సంచరించి రాఘవేంద్రస్వామి ఆలయం, శ్రీకృష్ణుడి ఆలయాలను ప్రతిష్ఠింప జేశారన్నారు.

అనంతాచార్యులు మాజీ సర్పంచ్ కిషన్‌రావు నేతృత్వంలో భూలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆధ్యాత్మిక దివ్యక్షేత్రాన్ని నరసాచలంలో ఏర్పాటు చేశారన్నారు. నరసాచల సేవాసమితి సభ్యులు సీతారామారావు, జనార్దన్‌రావు, ప్రభంజన్‌రావు, జయతీర్థాచారి, శ్రీపాద్ కులకర్ణి, శ్రీనివాస్,భరత్, హన్మేష్, ప్రకాశ్, శేషపాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం



ప్రాణప్రతిష్ఠ చేస్తున్న వీరబసంతు దంపతులు

మరికల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన దత్త లింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 9.45 నిమిషాలకు శివపార్వతులు, ఆంజనేయస్వామి, కాలభైరవుడు, నవగ్రహాలు, నాగదేవతలు, ధ్వజ స్తంభం ప్రతి ష్ఠాపన మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణలతో యంత్రం, ప్రాణప్రతిష్ఠ శెట్టి వీరబసంతు, నాగరత్నమ్మ దంపతులచే చేయించారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించారు. గత మూడు రోజులుగా ఆలయంలో సామూహిక హోమాలు, ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవాలకు ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ గ్రామ ప్రజలు, ఆడపడుచులు ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తులు పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

ఉండవెల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) అలంపూర్ చౌరస్తా సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. సమీప వ్యవసాయ పొలాల నుంచి జాతీయ రహదారిపైకి వచ్చిన జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. మృతి చెందిన జింకను బ్లూకోట్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఖాదర్ బాష, హోంగార్డు మద్దిలేటిలు ఔట్‌పోస్టుకు తరలించి ఆదివారం పశువైద్యాధికారి సతీష్‌చే పోస్టుమార్టం నిర్వహించారు.

ప్రజాప్రతినిధులకు విద్యార్థుల సన్మానం

- డ్రైవర్‌కు రూ.1,32,000 అందజేత



మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచులకు సన్మానం చేసిన విద్యార్థులు

అయిజ, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల సహకారం పొందిన విద్యార్థులు వారిని సన్మానించుకుని తమ కృతజ్ఞతను చాటుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని సంకాపూర్ గ్రామానికి చెందిన మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రాముడు (ప్రస్తుతం సింగిల్‌విండో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు), అతని భార్య గ్రామ మాజీ సర్పంచు సుజాతకు ఆ గౌరవం దక్కింది. వివరాల్లోకి వెళితే.. మారుమూల గ్రామమైన సంకాపూర్ నుంచి ఉన్నత విద్యను అభ్యశించేందుకై పరిసర గ్రామమైన ఉత్తనూర్ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సిందే. బస్సు సౌకర్యం లేని కారణంగా గత 10 సంవత్సరాలుగా వాహనం సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సంవత్సరం 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి 8,9,10 తరగతులు చదివే విద్యార్థులకు సైతం ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. దీనికి సంబంధించి వాహన యజమానికి అద్దె కింద రూ. 1,32,000లు ఆదివారం గ్రామంలో దంపతులిద్దరు కలిసి అందచేశారు. ఈ మధ్య కాలంలోనే 10వ తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. గ్రామం నుంచి 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో దంపతులు ఇద్దరికి విద్యార్థులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మీ సహకారం కారణంగానే ఉన్నత విద్యను చదువుతున్నామని తెలిపారు.

ఆప్త మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

గట్టు, మే 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆప్త మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు పదవతరగతి క్లాస్మేంట్స్. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని గంగిమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి రాముడు తన నూతన ఇంటి నిర్మాణం సందర్భంగా క్యూరింగ్ కోసం నీరు పడుతుండగా విద్యుదాఘాతంతో గత మూడు నెలల క్రితం మరణించాడు. ఇందులో భాగంగా రాముడి కుటుంబానికి చేయూత నివ్వడానికి పూర్వపు మిత్రులు అయిజ పట్టణంలో 2002 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న క్లాస్మేంట్స్ ముందుకు వచ్చారు. అందరు కలిసి రూ.60 వేలు జమ చేశారు. ఆదివారం గంగిమాన్‌దొడ్డి గ్రామానికి వెళ్లి రాముడు భార్యపిల్లలను కలిసి జమ చేసిన డబ్బులను ఆమెకు అందచేశారు.

జోగుళాంబను దర్శించుకున్న సినీ హీరో ఆది

అలంపూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ తనయుడు ఆది ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అర్చకులు స్వామి వారి ఆలయంలో గణపతి పూజ అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.



అర్చకుడి వద్ద ఆశీర్వాదం తీసుకుంటున్న సినీ నటుడు ఆది

న్యూస్ బాక్స్

'భూములను రిజిస్టర్ చేయించుకోవాలి'

మాగనూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు తమ భూములను రిజిస్టర్ చేయించుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌తో దేశంలోని ప్రతీ పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లు ప్రతీ రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు. రైతులు తమ ఆధార్, భూయాజమాన్య పాసు పుస్తకం, ఆధార్ లింక్ చేయబడిన మొబైల్ నెంబర్ తీసుకొని సమీపంలోని ఏవో, ఏఈవోలను సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదినం

నర్వ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ జన్మదినాన్ని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ మండల అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్‌రామ్, హనుమంత్‌రెడ్డి, రాంరెడ్డి, వావిల వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాచ్వార్ పేరు కొనసాగించాలి

● ఎంపీ డీకే అరుణకు వినతి

మక్తల్‌రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం కాచ్‌వార్ గ్రామ సమీపంలో ఉన్న టోల్‌గేట్‌కు కాచ్‌వార్ పేరును కొనసాగించాలని ఆదివారం ఆ గ్రామస్థులు ఎంపీ అరుణకు వినతిపత్రం అందించారు. నారాయణపేట శ్రీసరస్వతి శిశుమందిర్ విద్యాలయంలో డీకే.అరుణ జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో గ్రామస్థులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతుల భూములు తీసుకొని టోల్‌గేట్ నిర్మాణం చేపట్టారని, గ్రామానికి 200 మీటర్ల దూరంలోనే టోల్‌గేట్ ఉందన్నారు. కార్యక్రమంలో విష్ణువర్దన్‌రెడ్డి, మోహన్‌గౌడ్, రాఘవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలరాజ్‌గౌడ్, రామచంద్రి, విజయ్‌గౌడ్, సత్యనారాయణ, సాయిరెడ్డి, బి.అంజప్ప తదితరులున్నారు.

బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్



వెంకటేశ్‌యాదవ్‌కు నియామక పత్రం అందిస్తున్న కృష్ణయ్య

నారాయణపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మద్దూర్ వెంకటేశ్‌యాదవ్‌ను నియమిస్తు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించాలన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో జనరల్ స్థానాలు సైతం బీసీలు కైవసం చేసుకోవాలన్నారు.

భగత్‌సింగ్ విగ్రహావిష్కరణకు తరలి రావాలి

● పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్

ఊట్కూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని నారాయణపేట రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ విగ్రహావిష్కరణకు ప్రజలందరు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జీపు ద్వారా ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. భగత్‌సింగ్ పోరాట పటిమను కొనియాడుతూ ఆయన కోరుకున్న సమసమాజం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చెన్నప్ప, రాజు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పెద్దపొర్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ఓబ్లాపూర్‌లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లతో ప్రచారం చేస్తున్న సంఘం నాయకులు

ఊట్కూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబ్లాపూర్ గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక మక్తల్ కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగీశ్వరుడు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను గ్రామస్థులకు పంచుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మక్తల్ కమిటీ అధ్యక్షుడు ఈశ్వరయ్య, సభ్యులు కృష్ణయ్య, సత్యంగౌడ్, తిరుపతయ్య, వెంకటేష్, లహరి ఉన్నారు.

కాలువలు నిర్మించరూ..

» రోడ్లపైనే చెత్తా చెదారం

» 11వ వార్డులో రహదారులపై మురికినీటి ప్రవాహం

» 12వ వార్డులో డ్రైనేజీ లేక భరించలేని దుర్వాసనతో ప్రజానీకం



12వ వార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం



11వ వార్డులో రహదారులపై మురికి నీటి ప్రవాహం

నర్వ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైంది. 12వ వార్డులో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురికినీటి ప్రవాహం స్తంభించిపోయింది. దీనికితోడు వర్షాలు వచ్చినప్పుడు రహదారులపైకి చెత్తాచెదారం వచ్చేస్తోంది. అలాగే కాలువల్లోని వ్యర్థాలు నివాస గృహాల్లోకి చొచ్చుకు వస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. మండల కేంద్రంలో చిన్నపాటి వర్షం వస్తే చాలు 11, 12వ వార్డుల్లో వరద నీరు రోడ్లపై ఏరులై పారుతోంది. కాలువల్లోని చెత్తాచెదారం చిందరవందరవుతోంది. రోడ్లపై చెత్త పేరుకుపోతుంది. దీనికితోడు భరించలేని దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. సమస్య తెలిసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి, పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నా జీవితం ప్రజా సేవకే అంకితం

» జన్మదిన వేడుకల్లో ఎంపీ అరుణ » పేటలో పెద్ద ఎత్తున రక్తదానం



ఎంపీ డీకే అరుణను గజమాలతో సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేటటౌన్/మరికల్/మక్తల్, మే 4 (ఆంధ్రజ్యోతి): నా జీవితం ప్రజల సేవకే అంకితమని పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే.అరుణ అన్నారు. ఆదివారం నారాయణపేటలో ఎంపీ జన్మదినాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీ అరుణ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమెను గజమాల, శాలువాలతో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, లక్ష్మీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, పున్నంచంద్ లాహోటి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

అదేవిధంగా, మరికల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో ఎంపీ అరుణ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పట్టణంలో ఓ పెట్రోల్‌బంక్ ప్రారంభానికి వచ్చిన అరుణకు చిన్నారులు స్వాగతం పలకగా అనంతరం ఆమె వారికి నోట్‌బుక్స్, పలక, పెన్నులను అందించారు. ఆ తర్వాత కేక్ కట్ చేశారు. బీజేపీ నాయకులు ఎంపీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతరెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సిములు, పోలేమెని రమేష్, శెట్టి మహేందర్ తదితరులున్నారు.

మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ఎంపీ అరుణ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేద మహిళలకు బీజేపీ జిల్లా నాయకురాలు ప్రసన్న చీరలు పంపిణీ చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్నిస్వామి, పట్టణ అధ్యక్షుడు బాయికాటి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు నర్సింహారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బలరాంరెడ్డి, సత్యనారాయణ, రాంమాధవ్, జయానంద్, నర్సిములు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

● ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం కోరారు. జిల్లాలో దొంగతనాల నిర్మూలన కోసం పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచడం జరిగిందన్నారు. గ్రామాలతో పాటు, పట్టణ కేంద్రాల్లోని కాలనీల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100, కంట్రోల్ రూమ్ 8712670399కు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీస్‌స్టేషన్స్ పరిధిలో పూర్తి స్థాయి పెట్రోలింగ్ పెంచాలన్నారు. పెట్రోకార్ పెట్రోలింగ్, బ్లూకోట్స్ పెట్రోలింగ్, మఫ్టీలో పోలీసులను టాస్క్‌ఫోర్స్ పోలీస్‌ల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. దొంగతనాల నిర్మూలనకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు ఎవరైనా ఎక్కువ రోజులు తమ ఇళ్లకు తాళం వేసుకొని వెళ్లినా సంబంధిత లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తద్వారా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

11 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

మాగనూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మాగనూరు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో టెంకాయల వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో మాగనూరు గ్రామానికి చెందిన చిన్న తాయప్ప రూ.లక్షా 40 వేలకు టెంకాయల టెండర్‌ను దక్కించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య, ఆంజనేయులు, పుంజనూరు బాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

'పది' మండల టాపర్‌కు సన్మానం

మాగనూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సీనియర్ రిపోర్టర్ కే.శే.వెంకటపతి కుమార్తె బి.నిరంజని పదవ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచింది. విద్యార్థినిని ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు బి.కొండయ్య, నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, విద్యాభిమానులు పాల్గొన్నారు.

దొడ్డు ధాన్యం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ఆందోళన

మద్దూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): దొడ్డు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మద్దూర్‌లో రైతులు ఆందోళన చేశారు. రైతులకు మద్దతుగా నాయకులు రోడ్డుపై బైఠాయించారు. మిల్లర్లు ధాన్యం దింపుకోవడానికి నిరాకరించడంతో రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు ఈ దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ ఘటనా స్థలానికి చేరుకొని ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని, వీటిని రైస్‌మిల్లులకు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకుడు రాములు తదితరులున్నారు.

పన్ను రాయితీని వినియోగించుకోవాలి

» మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్



పన్ను రాయితీని వినియోగించుకుంటున్న ఇంటి యజమానురాలు

మద్దూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ మునిసిపల్ పరిధిలో ఉన్న ఇంటి యజమానులు పన్ను రాయితీని వినియోగించుకోవాలని కమిషనర్ శ్రీకాంత్ కోరారు. ఇంటి పన్నురాయితీకి అధికారులు అవకాశం కల్పించారు. ఈ మేరకు మునిసిపల్ పరిధిలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఇళ్ల బిల్లులు చెల్లించాలని కమిషనర్ కోరారు. ఆ అవకాశం అందుబాటులో వచ్చిన సందర్భంగా పట్టణానికి చెందిన ఆనందమ్మ మొదటగా తన ఇంటికి ఉన్న పన్ను రాయితీని వినియోగించుకున్నారు. అలాగే కొద్ది మేర పన్ను ఉన్న ఇళ్ల యజమానులు బిల్లులు చెల్లించి మునిసిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

ఘనంగా సైక్లింగ్ వేడుకలు



సైక్లింగ్ వేడుకల్లో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నాయకులు

మక్తల్, మే 4 (ఆంధ్రజ్యోతి): సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి మహేందర్ పాల్‌సింగ్, తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంతరావు ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సండే ఆన్ సైక్లింగ్ ప్రోగ్రామ్‌ను రిటైర్డ్ పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం మాట్లాడుతూ సైక్లింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 30 మంది బాల బాలికలు క్రీడా దుస్తులు, హెల్మెట్ ధరించి మక్తల్ మినీ స్టేడియం నుంచి పురవీధుల గుండా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో సైక్లింగ్ వల్ల తొడ కండరాలు, ఎముకలు బలంగా ఉంటాయన్నారు. గుండె, మధుమేహం సమస్యలకు ఉపశమనం లభిస్తుందన్నారు. సైక్లింగ్‌లో పాల్గొన్న బాలబాలికలకు మెడల్స్ అందించారు. కార్యక్రమంలో పీఈటీలు రాఘవేందర్, రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, అఖిల, లావణ్య, పల్లవి, రాకేష్ పాల్గొన్నారు.

కోస్గి, ఊట్కూర్‌లలో

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోస్గి/ఊట్కూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): కోస్గి పట్టణంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2006-07 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయప్రకాష్‌గౌడ్, శైలజ, సాయిబన్న నాందేవ్, వెంకట్‌రెడ్డితో పాటు విద్యార్థులు ఉన్నారు.



ఊట్కూర్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



కోస్గిలో సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

అదేవిధంగా, ఊట్కూర్‌లో జడ్పీహెచ్ఎస్ 1986-87 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు గత స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సుభాష్, లక్ష్మణ్, వెంకట్రాములను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, గురులింగస్వామి, వెంకట్రావ్, దత్తురావు, సురేష్‌రావు, చంద్రశేఖర్, సోమప్ప, శరణప్ప, గౌరిశంకర్, రాధాకృష్ణ, విజయలక్ష్మి, సుజాత, అంజమ్మ, మౌనేశ్వరి తదితరులున్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి చిత్రపటానికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శ ప్రాయుడయ్యారని కొనియాడారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో బీసీ అభివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీఆర్వో ఎం.ఏ.రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉడ్మల్‌గిద్దలో వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్థులు

దామరగిద్ద, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉడ్మల్‌గిద్ద గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. చివరిరోజు వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య గ్రామంలో నాలుగు బొడ్రాయిలను ప్రతిష్ఠించారు. ఆడపడుచులు పాటలు పాడుతూ బొడ్డెమ్మ వేశారు. యువకులు చెక్క భజనతో చూపరులను ఆకట్టుకున్నారు. బొడ్రాయి ఉత్సవాలతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది.

వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

» ఎంఈవో కృష్ణారెడ్డి

దామరగిద్ద, మే 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎంఈవో కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మొగల్‌మడ్క జడ్పీహెచ్ఎస్‌లో యువ భారత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు ఈ శిక్షణ శిబిరాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు(100 మంది)కి 15 రోజుల పాటు శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. శిబిరంలో ధ్యానం, మెగా డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, గణిత భావనలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఒక్కో కేంద్రంలో వంద మంది విద్యార్థుల చొప్పున 50 కేంద్రాల్లో యువ భారత వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయని, వీటిని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కాశప్ప, మాజీ సర్పంచు మహిపాల్, ఉపాధ్యాయులు నవశ్రీ, ప్రకాష్, అంజిలప్ప తదితరులున్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

» ఎస్ఐ బాల్‌రాజ్



బస్టాండ్‌లో వేలిముద్రలను సేకరిస్తున్న ఎస్ఐ బాల్‌రాజ్

కోస్గి మే 4 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లో దొంగతనాల పట్ల ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని కోస్గి ఎస్ఐ బాల్‌రాజ్ కోరారు. ఆదివారం కోస్గి బస్టాండ్‌లో ఆయన పలువురి నుంచి వేలిముద్రలను సేకరించారు. ప్రయాణికులు బస్సు ఎక్కే, దిగే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికుల మాటున దొంగతనాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాలతో బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

పార్కులో పరికరాలు అస్తవ్యస్తం

» పట్టించుకోని అధికారులు

» కరువైన ఆహ్లాదం.. ఆందోళనలో సందర్శకులు



అస్తవ్యస్తంగా మారిన ఉయ్యాల



పార్కులో తలకిందులైన బొమ్మ

నారాయణపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మునిసిపాలిటీ బీసీ కాలనీ పరిధిలో రూ.2.20 కోట్లతో ఏర్పాటు చేసిన మునిసిపల్ పార్కులో పరికరాలు అస్తవ్యస్తంగా మారి వెక్కిరిస్తున్నాయి. గత డిసెంబర్ 7న మునిసిపల్ పార్కును ఎంపీ డీకే.అరుణ, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిలు ప్రారంభించి, పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆరంభంలో కొన్ని నెలలు బాగానే ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు ఈదురు గాలులతో మునిసిపల్ పార్కులో ఉన్న పరికరాలు అస్తవస్తంగా తయారై వెక్కిరిస్తున్నా పట్టించుకోకపోవడంపై సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి ఎండలతో పార్కులో పచ్చదనం పూర్తిగా కరువైపోతోందని, పరికరాలు పాడైపోతున్నా పట్టించుకోవడం లేదని సందర్శకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మునిసిపల్ పార్కు పరికరాలు చక్కదిద్ది పచ్చదనం పెంపునకు తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పార్కులో విరిగిపోయిన రౌండ్ రింగ్